క్లుప్తంగా

ఎర్నిమాంబ ఉత్సవాలకు ఏర్పాట్లు



అమ్మవారి మాలధారణ చేసి భక్తులతో గురుస్వామి నూకరాజు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ జాతరలో భాగంగా గురుస్వామి బంటుపల్లి నూకరాజు నేతృత్వంలో గురువారం భక్తులు మాలధారణ చేశారు. ఎర్నిమాంబకు క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, కుంకుమపూజలు, విశిష్ట పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. శనివారం జరిగే తొలేళ్లు, ఆదివారం జరిగే ప్రధాన జాతరకు దేవదాయ ధర్మదాయ శాఖ కమిటీ ప్రతినిధులు, సంక్షేమ సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో రమణమూర్తి, మహాలక్ష్మి, జి.లక్ష్మణ్, పి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



నీతి కథలు చెబుతున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. దీనిలో భాగంగా గురువారం పిల్లలకు రిసోర్స్ పర్సన్ పి. శ్రీనివాసరావు గణితం, జామెంట్రీ, షార్ట్‌కట్‌లో మ్యాథ్స్ చెప్పారు. అనంతరం గ్రంథాలయ అధికారి ఎల్. రాజేంద్రవర్మ పిల్లలతో నీతి కథలు చెప్పించారు. కార్యక్రమంలో 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పిల్లలకు జ్యూస్, బిస్కెట్లు అందజేశారు.

విద్యార్థులకు నృత్య శిక్షణ



నృత్యంలో మెలకువలు నేర్పిస్తున్న యోగానంద్

అల్లిపురం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నృత్యంలో శిక్షణ అందజేశారు. డాన్స్ మాస్టర్ యోగానంద్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పి.రాధాకృష్ణలు నాట్యంలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ముగ్గురికి సరోగసీకి అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల వార్డులో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన సరోగసి(అద్దె గర్భం) మీద జిల్లా బోర్డు సమావేశం నిర్వహించారు. ముగ్గురు కుటుంబ సభ్యుల రిపోర్టులు పరిశీలించి సరోగసికి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, గైనకాలజీ వైద్యుడు డాక్టర్ సంజయ్, లీగల్ అడ్వైజర్ రమేష్,ఉమెన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బి.ఉమావతి, మానిటరింగ్ కన్సల్టెంట్ కె.శివాజీ ,జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

C/O 75 ఫీట్ రోడ్

- పాత మోటార్ వాహనాల స్పేర్ పార్ట్‌లకు చిరునామా
- బోల్ట్ నుంచి భారీ వాహనాల విడి భాగాల వరకు లభ్యం
- దేశం నలుమూలల నుంచి ఇక్కడికి రాక
- కొత్త దుకాణాలు నిర్మించి ఇవ్వాలని వ్యాపారుల విజ్ఞప్తి





75 ఫీట్ రోడ్డులో పాత వాహనాల స్పేర్ పార్ట్‌లు విక్రయించే దుకాణాలు

అల్లిపురం: పాత మోటార్ వాహనాల స్పేర్ పార్ట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా డాల్ఫిన్ హోటల్ దరి 75 ఫీట్ రోడ్డు పేరుగాంచింది. నాలుగు దశాబ్దాల కిందట ఇక్కడ ఒక్క దుకాణంగా మొదలై క్రమేపీ విస్తరించాయి. ఇప్పుడు 120 షాపుల వరకు ఏర్పడ్డాయి. నట్లు, బోల్ట్‌ల నుంచి భారీ వాహనాల విడి భాగాల వరకు ఇక్కడ లభ్యమవుతున్నాయి. వంశపారంపర్యంగా చాలా మంది ఇదే వృత్తిగా ఎంచుకున్నారు. రాను రాను దుకాణాల సంఖ్య పెరిగిపోవడంతో వ్యాపారాలు కూడా అంతంత మాత్రంగానే సాగుతున్నాయని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు.

ఏ పార్ట్ కావాలన్నా..

ప్రస్తుతం విశాఖ నగరంతోపాటు గాజువాకలో రెండు మూడు దుకాణాలు ఉన్నాయి. వాటిలో కేవలం లారీ పార్టులు మాత్రమే లభ్యమవుతాయని వ్యాపారులు చెబుతున్నారు. కార్లు, జీపులతోపాటు పాత అంబాసిడర్ కారు పార్ట్‌లు, షోరూంలో కూడా దొరకని పార్ట్‌లు 75 ఫీట్ రోడ్డులో లభ్యమవడం విశేషం. అందువల్లే ఎటువంటి స్పేర్ పార్ట్ కావాలన్నా సరే మెకానిక్‌లు ఇక్కడికే వస్తుంటారు. అదే విధంగా ద్విచక్ర వాహనాల స్పేర్ పార్ట్‌ల షాపులు కూడా ఇదే ప్రాంతం గాజుల వీధిలో సుమారు వంద వరకూ ఉండటం విశేషం. ఎటువంటి టూ వీలర్ పార్ట్ అయినా, పాతలాంటీ వాహనాల స్పేర్ పార్ట్‌లు కూడా ఇక్కడ లభిస్తాయి. నగర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి మెకానిక్‌లు వచ్చి తమ కావాల్సిన స్పేర్ పార్ట్‌లను కొనుగోలు చేసి వెళ్తుంటారు. ఇక్కడ ఒక షాపులో కాకుంటే మరో దానిలో అయినా స్పేర్ పార్ట్‌లు లభిస్తాయని వారి నమ్మకం.

40 ఏళ్లుగా..

వాహనాల స్పేర్ పార్ట్‌లకు చిరునామాగా 40 ఏళ్లుగా 75 ఫీట్ రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ స్టేడియం రోడ్డులోని జనతా కాంప్లెక్స్ ప్రసిద్ధి చెందింది. ఇక్కడికి దేశంలోని పలు ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తుంటారు. ముఖ్యంగా ఒడిశా, చత్తీష్‌ఘడ్, హైదరాబాద్, ఢిల్లీలతోపాటు రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, విజయనగరం ప్రాంతాల నుంచి ఎక్కువ మంది వచ్చి తమకు అవసరమైనవి కొనుక్కుని వెళ్తుంటారు. ఇక్కడి షాపులపై ఆధారపడి ప్రత్యక్షంగా వెయ్యి మంది, పరోక్షంగా మరో 2 వేల మంది ఉపాధి పొందుతున్నారు. చిన్న, పెద్ద షాపులు ఉండటంతో దుకాణాన్ని బట్టి రోజుకు రూ.1,000 నుంచి రూ.10 వేలు ఆపైన వ్యాపారం జరుగుతుంటుందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, జనతా కాంప్లెక్స్ స్థానంలో కొత్త దుకాణాలు నిర్మించి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నలభై ఏళ్లుగా 75 ఫీట్ రోడ్డులోనే వ్యాపారాలు చేస్తూ ఉపాధి పొందుతున్నాం. స్టేడియం రోడ్డులో శిథిలమైన జనతా కాంప్లెక్స్‌ను తొలగించి, నూతనంగా నిర్మించి తమకు షాపులు కేటాయిస్తే ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. ప్రభుత్వం స్థానిక వ్యాపారులను గుర్తించి దుకాణాలు కేటాయించాలి.

– సయ్యద్ నౌషద్, భారత్ మోటార్స్

అంతంత మాత్రంగానే వ్యాపారాలు

గతంలో వ్యాపారాలు బాగుండేవి. ఇతర ప్రాంతాల్లో కూడా ఇటువంటి వ్యాపారాలు పెరిగాయి. దీంతో ఇక్కడికి వచ్చే వారు తగ్గారు. ఒక్కో రోజు బోని కూడా అవ్వదు. మరో రోజు ఆశాజనకంగా ఉంటుంది. మాకు ఈ వ్యాపారం తప్ప మరోటి రాదు.

– సల్మాన్, పాత మోటార్ పార్ట్‌ల వ్యాపారి

పాత వాహనాలు కొనితెస్తాం

ఈ వ్యాపారానికి పాత వాహనాలే ఆధారం. పోలీస్, ఇతర ఫైనాన్స్ సంస్థలు పాత వాహనాలను వేలం వేస్తుంటారు. వాటిని పాడి తీసుకొస్తాం. వాహనాలు డిస్మేటల్ చేయడానికి కొంత ఖర్చు అవుతుంది. ఒక్కోసారి లాభం వస్తుంది. ఒక్కోసారి వేలంలో పాడిన దానికంటే తక్కువ వస్తుంటుంది. దీని వల్ల నష్టాలు కూడా చూస్తున్నాం.

– సయ్యద్ హలీం, స్పేర్ పార్ట్‌ల దుకాణ యజమాని

ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖత్నా ఓ సంప్రదాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ కూడా ఖత్నా(సున్తీ)ను ఓ సంప్రదాయంగా భావిస్తున్నాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ముస్లిమ్స్ యంగ్ మ్యాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 35వ వార్డు సైలాడ పైడితల్లి కల్యాణ మండపంలో ఖత్నా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు అందరూ ఖత్నా చేయించుకుంటున్నారన్నారు. అనంతరం 1000 మంది చిన్నారులకు ఖత్నా చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కమిటీలో గైస్ ప్రిన్సిపాల్

మురళీనగర్: 2023 పాలిసెట్ అడ్మిషన్ కమిటీలో విశాఖపట్నం గవర్నమెంట్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటరమణకు అవకాశం కల్పించారు. పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థుల ఎంపికలో ఈయన బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

అదృశ్యమైన యువకుడు ఆత్మహత్య

ఆనందపురం : మండలంలోని కోలవానిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల అదృశ్యం కాగా గురువారం గోరింట శివారులోని ఓ లేఅవుట్‌లో శవమై కనిపించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోలవానిపాలెం గ్రామానికి చెందిన గంట్రెడ్డి దేముడు, మహాలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం కాగా దారయ్య (26) ఆఖరివాడు. పదో తరగతి వరకూ చదువుకున్న దారయ్య పెందుర్తి మండలం గొరపల్లిలో ఓ యజమాని వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. ఈ నెల 13న ఎప్పటిలాగే ద్విచక్ర వాహనంపై గొరపల్లి వెళ్లి విధుల్లో జాయిన్ అయ్యాడు. సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి విధులు ముగించుకొని వస్తున్నానని సమాచారం ఇచ్చాడు. అనంతరం రాత్రి 8 : 30 గంటల ప్రాంతంలో మరలా ఇంటికి ఫోన్ చేసి పని ఉందని, ఇంటికి రావడం లేదని చెప్పాడు. అలా తెలిపిన దారయ్య మరుసటి రోజు ఉదయానికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అతను పనిచేస్తున్న యజమానిని వాకబు చేశారు. 13న సాయంత్రమే పనిలో నుంచి వెళ్లిపోయినట్లు తెలపడంతో దారయ్య ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి చేసి ఉంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలోని గోరింట గ్రామంలోని కొండవాలు ప్రాంతంలో వేసిన లేఅవుట్‌లో యువకుడి శవం పడి ఉండడాన్ని కొంతమంది గమనించి పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అది దారయ్య మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. సీఐ రామచంద్రరావు, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఘటనా స్థలంలో ఉన్న పురుగుల మందు డబ్బా, మద్యం సీసా, వాటర్ బాటిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆన్ చేసి వివరాల సేకరణకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు పాల్పడడానికి ముందు రోజున దారయ్య తన స్నేహితుడిని కలిసి తనకు తీవ్ర అనారోగ్యంగా ఉందని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని కోరినట్లు తెలిసింది. అనారోగ్య కారణాల వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దారయ్య (ఫైల్)



మృతదేహం వద్ద విచారణ జరుపుతున్న సీఐ రామచంద్రరావు సిబ్బంది

క్రైం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను గురువారం మధ్యాహ్నం క్రైం డీసీపీ జి.నాగన్న సందర్శించారు. ఆయనను క్రైం సీఐ ఎర్రంనాయుడు, ఎస్ఐ ఖగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రికార్డులు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించిన డీసీపీ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సిబ్బంది సంక్షేమంపై ఆరా తీశారు. ఎంత మంది విధుల్లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ ఇరుగ్గా ఉండటంతో కొత్త భవనం విషయమై సీపీ దృష్టిలో పెడతానని తెలిపారు. దీనికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. నైట్ డ్యూటీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న క్రైం డీసీపీ నాగన్న

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం గురువారం పిఠాపురం కాలనీలోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్.వి. రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల పరిష్కారానికి సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తీసుకువెళ్లారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గత నెల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో చేసిన తీర్మానాల అమలుకు ఉద్యోగులంతా సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు కుసుమంచి కృష్ణాజీ, నరసింహం పాల్గొన్నారు.



సమావేశమైన ఏపీజీఈఏ నాయకులు

ప్లాస్టిక్ ఉపయోగిస్తే చర్యలు తప్పవు

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ ఉపయోగిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.సుధాకర్ అన్నారు. జీవీఎంసీ 35వ వార్డులోని పూర్ణా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వ్యాపారుల వద్ద నిషేధిత కవర్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ మానవాళికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్‌ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడాలన్నారు. చిరు వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్టు తనిఖీల్లో వెల్లడవుతుందని చెప్పారు. నిషేధిత కవర్లు అమ్మకాలు చేపట్టవద్దని సూచించినా దొంగచాటున విక్రయిస్తున్నారన్నారు. తక్షణమే అమ్మకాలు నిలిపి వేయాలని లేనిపక్షంలో అపరాధ రుసుముతోపాటు దుకాణాల ట్రేడ్ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సెక్రటరీ మురళీ తదితరులు పాల్గొన్నారు.



కవర్లు స్వాధీనం చేసుకుంటున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

కార్పొరేటర్ సాధిక్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ రోడ్డు ఆక్రమణకు గురైనా అధికారులు చోద్యం చూస్తున్నారని 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కారించాలని.. అధికారులు ఒక్కటై ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని జీవీఎంసీ అధికారులపై సాధిక్ మండిపడ్డారు. వార్డు పరిధి కోటవీధి నుంచి కొండగుడికి వెళ్లే దారి ఆర్చి వద్ద గురువారం స్థానికులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కోటవీధి నుంచి కొండగుడికి వెళ్లే మార్గంలో ఫిషింగ్ హార్బర్ వరకు నిత్యం 850 భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో వందలాది మంది ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. జీవీఎంసీకి చెందిన రోడ్డును పోర్టు యాజమాన్యం ఇష్టానుసారంగా ఉపయోగిస్తూ ఆ ప్రాంత వాసులకు కంటి మీద నిద్ర లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా స్పందన కరువైందన్నారు. కార్పొరేటర్‌గా ఎన్నికైన తర్వాత సమస్యను అధికారులతో పాటు మేయర్ దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఈ విషయమై నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి స్పందించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారన్నారు. దాంతో జీవీఎంసీ అధికారులు ఆ రోడ్డుని బ్లాక్ చేసి(సాధారణ వాహనాలకు ఇబ్బంది లేకుండా) ఏర్పాట్లు చేశారన్నారు. అయితే పోర్టు యాజమాన్యం అధికారులను మరో 6 నెలల గడువు కోరినట్టు చెప్పారు. ఈ సమయంలో ఈ ప్రాంత వాసులకు ఏమైనా జరిగితే అందుకు బాధ్యులు ఎవరో చెప్పాలన్నారు. అధికారులు ఒక్కటై ప్రజా సమస్యలు విస్మరిస్తే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సాధిక్

ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం ఆపాలి

దాబాగార్డెన్స్: ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం ఆపాలని కోరుతూ సిటూ ప్రతినిధుల బృందం నగర పోలీస్ కమిషనర్‌ను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రజాతంత్ర ఉద్యమాలపై కొంత మంది పోలీసు అధికారులు అక్రమ కేసులు, బైండ్ ఓవర్ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. సిటూ కార్మికులు, ప్రజల హక్కుల కోసం పోరాడే సంస్థ అని, ఎటువంటి చట్ట వ్యతిరేక, ద్రోహపూరిత చర్యలకు పాల్పడదని ఆ వినతిలో పేర్కొన్నారు. ఇటువంటి సంస్థ(యూనియన్)లలో పనిచేస్తున్న కార్మిక నాయకులు, కార్యకర్తలపై కొంత మంది పోలీసు అధికారులు అక్రమ కేసులు బనాయించడంతో పాటు తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లి రూ.లక్షకు బైండ్ ఓవర్ చేయిస్తున్నారని తెలిపారు. ఇది సహజ న్యాయసూత్రాలకు భిన్నమైందని పేర్కొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు మధ్యాహ్న హారతి సమర్పించిన అనంతరం భక్తులు, పేదలు, యాచకులకు అన్నదానం జరిపారు. రాత్రి పల్లకీ సేవలో మహిళా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ధ్యాన మందిరంలో ఓమ్ని ఆర్కే ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ సిబ్బందితోపాటు సుమారు 100 మంది భక్తులు వైద్య సేవలు పొందారు. పెద్దలు, చిన్నపిల్లలకు పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. మంగమ్మ డెంటల్ హాస్పిటల్ సహకారంతో దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, హాస్పిటల్స్ డాక్టర్ చిత్తరంజన్, సిబ్బంది గౌరినాయుడు, చంటి, దేవిక, మానస పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న భక్తులు

స్వర్ణకార అప్రైజర్లను ఆదుకోవాలి

టీవీ రోడ్డు: అరకొర జీతాలతో పని చేస్తున్న స్వర్ణకార అప్రైజర్లను బ్యాంకులు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు గురువారం బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్‌ను కలిసి పుష్పగుచ్ఛంతో పాటు వినతి పత్రం అందజేశారు. బ్యాంకు మనుగడకు దోహదపడుతున్న స్వర్ణకార అప్రైజర్లకు మాత్రం ఎటువంటి ఆధారం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని రీజనల్ మేనేజర్ హామీ ఇచ్చారు.



బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కర్రి వేణుమాధవ్

వినియోగదారుల రక్షణ చట్టంపై శిక్షణ

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా వినియోగదారుల సంఘం సమైక్య కార్యాలయంలో సంఘ చైర్మన్ మర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వినియోగదారుల రక్షణ చట్టంపై సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఏయూ రిటైర్డ్ వీసీ ఆచార్య లజపతిరాయ్, బీఐఎస్ సైంటిస్ట్ సంధ్య మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు ఎలా మోసపోతున్నారో తెలుసుకోడానికి కొన్ని సంస్థలను ఎంపిక చేసి సర్వే రిపోర్ట్‌ను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కోర్టు అంటే భయపడేవారు, చదువురాని వారికి వినియోగదారుల సంఘం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే వినియోగదారుల రక్షణ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో బీఐఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి బీఐఎస్ బ్యాచ్ నంబర్ చెక్ చేసుకుని వస్తువులు కొనుగోలు చేయాలని ట్రైనింగ్ ఇచ్చారు. వినియోగదారుల సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఫెడ్కో చైర్మన్ సత్యనారాయణ తెలిపారు.

గంగవరం పోర్టు ఉద్యోగుల సమస్యలపై వినతి

పెదగంట్యాడ: గంగవరం పోర్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కోరారు. నగరానికి వచ్చిన చంద్రబాబును వేపగుంటలో గురువారం కలిసి, వినతిపత్రం సమర్పించారు.